క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



పాలాటలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మెడిసిటి వైద్యులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పాలాట గ్రామంలో మెడిసిటీ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఎవరికైతే చికిత్సలు అవసరం వారిని గుర్తించి వారికి ఉచితంగా ఆపరేషన్ చేస్తామని ఆస్పత్రి వైద్యులు మేఘన, దుర్గ, వినయ్, కార్తీక్ తెలిపారు. 105 మందికి షుగర్, బీపీ టెస్టులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మీనర్సయ్య, ఆస్పత్రి మార్కెటింగ్ ఇన్‌చార్జి కుమారస్వామి, సంజయ్, శేఖర్‌బాబు, సుకేశ్, కల్పన, పంచాయతీ కార్యదర్శి గీత, గ్రామ నాయకులు సాయికుమార్ వెంకటేష్, శ్రీనివాస్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ సభ్యత్వాలను వేగవంతం చేయాలి



సభ్యత్వ పత్రాలను అందిస్తున్న బాలచందర్

చేగుంట(తూప్రాన్): బీజేపీ సభ్యత్వాలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా టెలికం బోర్డు మెంబర్ బాలచందర్ అన్నారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఆదేశాలతో బీజేపీ తరపున 125 మంది క్రియాశీలక సభ్యత్వాలను నమోదు చేయించిన బాలచందర్ శనివారం మండలాధ్యక్షుడు భూపాల్‌కు అందించారు. ఈ సందర్భంగా బాలచందర్ మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి ఎసభ్యత్వాలను పూర్తి చేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పాండు, రాజు, యాదగిరి తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి లక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షికోత్సవాలు



ముస్తాబైన లక్ష్మీనర్సింహస్వామి ఆలయం

అల్లాదుర్గం(మెదక్): మండల కేంద్రం అల్లాదుర్గంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు శనివారం తెలిపారు. ఉదయం 6 గంటలకు స్వామివారికి సుప్రభాత సేవా, 8 గంటలకు గణపతి పూజ, అభిషేకం ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు. భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరవుతున్నట్లు చెప్పారు.

పీఆర్టీయూ జిల్లా కార్యదర్శిగా ప్రవీణ్



పాపన్నపేట(మెదక్): మెదక్ జిల్లా పీఆర్టీయూ కార్యదర్శిగా ప్రవీణ్‌ను నియమించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు కృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన పాపన్నపేట ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ప్రవీణ్ నియామకంపై మండల శాఖ అధ్యక్షులు రాజు, సురేశ్ హర్షం వ్యక్తం చేశారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని బాలవీరహనుమాన్ ఆలయంలో శనివారం అర్చకులు మెట్టురాములుశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, చందన అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

నిర్మించారు.. వదిలేశారు

నర్సాపూర్: పటణంలోని వ్యవసాయ మార్కెట్ కమి టీ కార్యాలయ ఆవరణలో మార్కెట్ కమిటీకి చెందిన రూ. 81 లక్షలతో 10 దుకాణాల సముదాయం నిర్మించారు. 2022లో అప్పటి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆ సముదాయాన్ని ప్రారంభించారు. అయితే అప్పటి నుంచి దుకాణాలను అద్దెకు ఇవ్వకుండా వృథాగా వదిలేశారు. దీంతో మార్కెట్ కమిటీకి నెల నెలా వచ్చే ఆదాయం రాకుండా పోతోంది. ఆ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో దుకాణ షెట్టర్లు వృథాగా ఉంటున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ఒక దుకాణ షెట్టరును నెలకు రూ.మూడు వేల నుంచి రూ.మూడున్నర వేలకు అద్దెకు ఇచ్చినా.. సంవత్సరానికి మార్కెట్ కమిటీకి రూ.నాలుగు లక్షల వరకు రావాల్సిన ఆదాయం షెట్టర్లు వృథాగా ఉండడంతో రాకుండా పోతోంది.



వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో వృథాగా షెట్టర్ల సముదాయం

వ్యాపారులు వచ్చినా.. ఇవ్వడం లేదు

నర్సాపూర్ పట్టణానికి చెందిన పలువురు వ్యాపారులు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన దుకాణ షెట్టర్లను అద్దెకు ఇవ్వాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులను సంప్రదించినట్లు తెలిసింది. వ్యాపారులు షెట్టర్లను అద్దెకు ఇవ్వాలని అధికారులను కోరగా, నిబంధనల మేరకు ఇస్తామని చెప్పారే తప్ప షెట్టర్లు అద్దెకు ఇచ్చేందుకు సరైన చర్యలు తీసుకోలేదని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా షెట్టర్లను అద్దెకు కేటాయించాలని వ్యాపారులు కోరుతున్నారు. కాగా ప్రభుత్వం నిర్ణయించిన అద్దె ఎక్కువగా ఉందని, అద్దెను కొంత తగ్గించాలని పలువురు వ్యాపారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నిర్ణీత అద్దె రానందున ఇవ్వలేదు

మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన షెటర్లను అద్దెకు ఇవ్వడానికి తమ ఉన్నతాధికారులు ఒక షెటరుకు నెలకు రూ.మూడున్నర వేల అద్దె నిర్ణయించారు. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ఓపెన్ టెండరు పిలిచాం. ప్రభుత్వం నిర్ణయించిన అద్దెకు షెట్టర్లు తీసుకునేందుకు వ్యాపారులు ఎవరు రానందున కేటాయించలేదు. త్వరలో టెండరు పిలుస్తాం. నిబంధనల మేరకు వ్యాపారులకు కేటాయిస్తాం.

– ప్రతాప్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి

విజయోత్సవాలను విజయవంతం చేయాలి

నర్సాపూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నందున చేపట్టే ప్రజా పాలన విజయోత్సవాలను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ కోరారు. శనివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమ పార్టీ ఇచ్చిన హామీలను రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నెరవేస్తూ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలు అమలు చేస్తుందని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు అమలు చేస్తున్న హామీలను ప్రజల వద్దకు తీసుకుపోయి వివరించాలని పార్టీ కార్యకర్తలను కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టే విజయోత్సవాల్లో పార్టీకి చెందిన గ్రామస్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి బాధ్యులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఉపయోగపడే పనులు ఎంపిక చేయాలి



కూకుట్లపల్లిలో ఉపాధిహామీ గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

● ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): ఉపాధిహామీలో గ్రామస్తులు, రైతులకు ఉపయోగపడే పనులు ఎంపిక చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని కూకుట్లపల్లిలో 2024–25 సంవత్సరానికి కూలీలకు పనులు కల్పించేందుకు ఉపాధి హామీ పనుల ఎంపిక గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామస్తులు, రైతులకు ఉపయోగపడే పనులతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందే పనులు ఎంపిక చేయాలన్నారు. గ్రామంలో 549 జాబ్ కార్డులు ఉండగా, 620మంది పనులు చేస్తున్నారని కూలీలందరికీ వందరోజులు పనులు కల్పించేలా పనులు ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపాలన్నారు. ఈ సందర్భంగా ఫాంపండ్, బర్లషెడ్, ఫీడర్‌చానెల్, మట్టిరోడ్డు తదితర పనులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పుణ్యదాస్, ఫీల్డ్ అసిస్టెంట్ శేక్‌అలీ, గ్రామస్తులు, కూలీలు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటింటి సర్వే చేయండి



కొల్చారం(నర్సాపూర్): సర్వే పత్రాలను తనిఖీ చేస్తున్న జెడ్పీ సీఈఓ ఎల్లయ్య



శివ్వంపేట(నర్సాపూర్): చిన్నగొట్టిముక్కలలో సర్వే చేస్తున్న ఎన్యుమనేటర్లు

కొల్చారం(నర్సాపూర్): తప్పులు దొర్లకుండా పకడ్బందీగా ఎన్యుమనేటర్లు సర్వే చేపట్టాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య సూచించారు. శనివారం మండలంలోని అప్పాజీపల్లి గ్రామంలో కొనసాగుతున్న సర్వేను సీఈఓ తనిఖీ చేశారు. సర్వే పత్రాలు క్షుణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు ఇచ్చే సమాచారాన్ని అమూల్యమైనదిగా పత్రాల్లో నమోదు చేయాలని, ఎన్యుమనేటర్లను ఆదేశించారు. ఈ సర్వేలో ఎంపీడీఓ కృష్ణవేణి, ఎన్యుమరేటర్లు రాజశేఖర్, సాయి ఉన్నారు.

ముమ్మరంగా సర్వే

శివ్వంపేట(నర్సాపూర్): మండల వ్యాప్తంగా ఇంటింటి సర్వే ముమ్మరంగా జరుగుతోంది. ఈ సర్వే తీరుని పలువురు అధికారులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇళ్ల వద్దకు వచ్చే సిబ్బందికి ప్రజలు పూర్తిస్థాయి సమాచారం ఇవ్వాలని ఎంపీఓ తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి సూచించారు.

భక్తిశ్రద్ధలతో ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ధర్మాసాగర్ గేట్ వద్ద నూతనంగా నిర్మించిన శివ పంచయాతన నవగ్రహ సహిత సంజీవాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. గ్రామ పురోహితుడు రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు గోపూజ, గురుపూజ, గణపతిపూజ, హోమం నిర్వహించారు. అనంతరం దేవతామూర్తుల విగ్రహాలను జలాధివాసం చేశారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక



నరేందర్

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం నర్సంపల్లి గ్రామానికి చెందిన బొమ్మగారి నరేందర్ ఆరు నెలల్లో మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ఓయూలో పీజీ చేస్తూ ఉద్యోగాలకు శిక్షణ పొందాడు. ఆరు నెలల క్రితం సివిల్ కానిస్టేబుల్‌కు ఎంపికై శిక్షణ పొందుతుండ గా, అక్టోబర్‌లో ప్రకటించిన డీఎస్సీలో ఉపాధ్యాయుడిగా ఎంపికై తూప్రాన్ మండలం జెండాపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నాడు. తాజాగా గురువారం ప్రకటించిన గ్రూప్ 4లో వార్డ్ ఆఫీసర్‌గా ఎంపికయ్యాడు.

దాదాయిపల్లిలో యువకుడి అదృశ్యం



రాజు

టేక్మాల్(మెదక్): యువకుడు అదృశ్యమైన సంఘటన మండలంలోని దాదాయిపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ తుక్కయ్య తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కొటంగారి రాజు వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈనెల 13న ఉదయం పొలానికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రం అయినా రాజు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతంలో, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు తండ్రి దుర్గయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

చెట్లు ధ్వంసం చేసిన వ్యక్తికి జరిమానా

నర్సాపూర్: అటవీ శాఖకు చెందిన భూమిలో చెట్లను ధ్వంసం చేసిన వ్యక్తికి జరిమానా విధించనున్నట్లు ఎఫ్ఆర్ఓ అరవింద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శివ్వంపేట మండలం తాళ్లపల్లి తండా నుంచి శ్మశాన వాటికకు వెళ్లే దారిని చదును చేసే క్రమంలో అటవీ భూమిలోని పది చెట్లను ధ్వంసం చేశారన్నారు. దారి చదును చేసే పనులను అదే తండాకు చెందిన శంకర్ చేపట్టారని వివరించారు. చెట్లు ధ్వంసం చేసినందున రెండు డోజర్లు అదుపులోకి తీసుకున్నామని, చెట్లు ధ్వంసం చేసినందుకు ఉన్నతాధికారుల సూచనలతో జరిమానా విధిస్తామన్నారు.

జల సంరక్షణపై అవగాహన

నర్సాపూర్: నీటిని సంరక్షించడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో యువత ప్రత్యేక దృష్టి పెట్టాలని బీటెక్ విద్యార్థి సాత్విక బుస్సా అన్నారు. ఓ ప్రైవేట్ కాలేజీలో బీటెక్ చదువుతున్న సాత్విక తన ప్రాజెక్టు ప్రోగ్రాంలో భాగంగా శనివారం స్థానిక తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల, కాలేజీ విద్యార్థులకు జల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోజూ వారి వినియోగంలో నీటిని పొదుపుగా వాడాలని, తదితర పలు అంశాలు ఆమె విద్యార్థులకు వివరించారు.

విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీ

వెల్దుర్తి(తూప్రాన్): విద్యుత్ శాఖ అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి 15 కేసులు నమోదు చేశారు. వెల్దుర్తి మండలంలోని పలు గ్రామాల్లో 15 బృందాలుగా ఏర్పడి అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు బీవీ సుధాకర్ పర్యవేక్షణలో విజిలెన్స్ ఏడీఈలు నవీన్‌కుమార్, నాగసాయి, ముత్యాలంపాడు, ఏఈబీ వెంకటస్వామి, విజిలెన్స్ ఏఈలు, టౌన్ డివిజన్ ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

మోటార్ చోరీ

నర్సాపూర్: పట్టణంలోని వృద్ధాశ్రమంలోని నీటి సంపు నుంచి కరెంట్ మోటార్ చోరీ అయిందని ఎస్ఐ– 2 శ్రీనివాస్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని జగన్నాథరావు కాలనీ ఏరియాలో ఉన్న వృద్ధాశ్రమంలోని సంపు నుంచి శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు మోటార్‌ను చోరీ చేశారని అన్నారు. ఆశ్రమం ప్రతినిధి సుజాత ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

లీకేజీతో ఇబ్బందులు

శివ్వంపేట(నర్సాపూర్): అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మురికినీరు లీకేజీతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం శివ్వంపేటలోని పురాతన శివాలయం ఎదుట ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురికినీరు లీక్ అవుతోంది. దీంతో మురికినీరు సీసీరోడ్డు గుండా ప్రవహిస్తుండడంతో భక్తులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం గురించి పంచాయతీ కార్యదర్శి రమాదేవి దృష్టికి తీసుకెళ్లగా.. ఈ సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా సత్యం

రామాయంపేట(మెదక్): పద్మశాలి సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మద్దెల సత్యంను నియమించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వి.రాజ్ కుమార్, ఐఏఎస్ అధికారి నరహరిలు శనివారం గజ్వేల్‌లో నియామక పత్రం అందజేశారు. అనంతరం సత్యం మాట్లాడుతూ.. పద్మశాలి సంఘం హక్కుల కోరకు అనునిత్యం పోరాడుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జయరాం, రామాయంపేట మండల అధ్యక్షుడు రమేశ్, మోహన్, బల్ల సుధాకర్, శ్రీను ఉన్నారు.

హెర్బల్ గార్డెన్‌లో ఎండిన మొక్కలు

నర్సాపూర్: పట్టణంలోని ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని అర్బన్ పార్కులో ఏర్పాటు చేసిన హెర్బల్ గార్డెన్‌లోని చాలా మొక్కలు ఎండిపోయాయి. అర్బన్ పార్కు ఏర్పాటు సమయంలో పార్కు ఎంట్రెన్స్ నుంచి వాచ్ టవర్‌కు వెళ్లే దారి పక్కన హెర్బల్ గార్డెన్ ఏర్పాటు చేశారు. ఆయుర్వేద మొక్కలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశ్యంతో గార్డెన్‌లో పలు రకాల ఆయుర్వేద మొక్కలు నాటి, వాటి పేర్లు వాటి వినియోగం వివరాలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేశారు. హెర్బల్ గార్డెన్ ఏర్పాటు చేసి.. నాలుగు ఏళ్లు కావడంతో పలు రకాల మొక్కల జీవితకాలం సమయం అయిపోవడంతో కొన్ని మొక్కలు ఎండిపోయాయి. మిగిలిన మొక్కల ఆలన పాలన సరిగా లేనందున మరిన్ని మొక్కలు ఎండుముఖం పట్టాయి. కాగా ఆయుర్వేద మొక్కలపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన హెర్బల్ గార్డెన్‌ను పునరుద్ధరించి ఆయువు తీరిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాలని, ఇతర మొక్కలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై అటవీ శాఖ ఎఫ్ఆర్ఓ అరవింద్‌ను వివరణ కోరగా.. ఆయువు తీరి చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త వాటిని నాటేందుకు చర్యలు తీసుకుంటామని, గార్డెన్‌లోని మొక్కలను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.



ఎండుముఖం పట్టిన మొక్కలు

వెంటనే ధాన్యం తరలించండి



చిన్నశంకరంపేట(మెదక్): మదూర్ సొసైటీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

● రైతుల నిరసన

చిన్నశంకరంపేట(మెదక్): ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం కాంటా చేసి వెంట వెంటనే రైస్ మిల్లుకు తరలించాలని మండలంలోని మదూర్ గ్రామ రైతులు సహకార సంఘం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. శనివారం మదూర్ సహకార సంఘం ఎదుట రైతులు చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని నిలదీశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. మదూర్ సొసైటీ పేరుకే ఉందని, లారీలు పంపాలని కోరితే చైర్మన్ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని మండిపడ్డారు. అధికారులు వెంటనే స్పందించి మదూర్ ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యాన్ని తరలించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

లారీలను అన్‌లోడ్ చేయండి: ఆర్డీఓ

నర్సాపూర్: కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యంతో వచ్చే లారీలను వెంటనే అన్‌లోడ్ చేయాలని ఆర్డీఓ మహిపాల్ పలు రైసుమిల్లుల యజమానులకు సూచించారు. ఆయన శనివారం పట్టణంలోని తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ ఫైజల్‌తో కలిసి మండలంలోని పలు ధాన్యం కేంద్రాలతో పాటు పలు రైసుమిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిల్లుల్లో ఎక్కువ మంది హమాలీలను నియమించుకోవాలని, కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం బస్తాలతో వచ్చే లారీలను వెంటనే అన్‌లోడ్ చేసి పంపాలని మిల్లర్లకు సూచించారు. లారీలు నిలిచిపోతే కొనుగోలు కేంద్రాల నుంచి వడ్ల బస్తాల రవాణా నిలిచిపోతుందని, తూకం వేసిన వడ్ల బస్తాలను వేగంగా తరలించేందుకు సెంటర్ల నిర్వాహకులతో సహకరించాలన్నారు. వడ్లు ఆరగానే తూకం వేయాలని, రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు అందరు పాటించాలన్నారు. మండలంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వివరాలు, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ప్యాక్స్ చైర్మన్ రాజుయాదవ్ ఆర్డీఓకు వివరించారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ మహిపాల్

ఇబ్బందులుంటే చెప్పండి: తహసీల్దార్

చిన్నశంకరంపేట(మెదక్): ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపులో ఇబ్బందులు తలెత్తితే తమతో చెప్పాలని తహసీల్దార్ మన్నన్ కోరారు. శనివారం మండలంలోని ఖాజాపూర్, శాలిపేట గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో, నిర్వాహకులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శాలిపేట, ఖాజాపూర్ గ్రామాల్లోని రైస్‌మిల్లలను పరిశీలించారు. వెంటనే లారీలను అన్‌లోడ్ చేసి పంపాలని రైస్‌మిల్లు యజమానులకు ఆయన సూచించారు.



చిన్నశంకరంపేట(మెదక్): శాలిపేటలో ధాన్యం పరిశీలిస్తున్న తహసీల్దార్ మన్నన్

చికిత్స పొందుతూ యువకుడి మృతి



మహేందర్‌గౌడ్

కౌడిపల్లి(నర్సాపూర్): చికిత్స పొందుతూ శనివారం నీమ్స్ ఆస్పత్రిలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కంచన్‌పల్లి గ్రామానికి చెందిన కీసరి మహేందర్‌గౌడ్(34) హైదరాబాద్‌లోని ప్రైవేట్ కంపెనీలో కూలీపని, డ్రైవర్ పనులు చేస్తున్నాడు. గత నెలలో కంపెనీలో ట్రాలీ ఆటో నడుపుతుండగా ఆటో ట్రాలీలో కూర్చున్న వ్యక్తి కిందపడటంతో గాయాలయ్యాయి. ఈ విషయమై బాధిత కుటుంబ సభ్యులు పంచాయితీ నిర్వహించి జరిమానా వేశారు. దీంతో డబ్బులు చెల్లించే విషయమై మనస్థాపం చెంది.. ఈ నెల 10న ఇంట్లో పురుగుల మందు తాగాడు. దీంతో అతన్ని కుటుంబ సభ్యులు మెదక్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం హైదరాబాద్ నీమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి తమ్ముడి ఫిర్యాదుతో కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రిపుల్‌ఆర్ భూముల సర్వే

శివ్వంపేట(నర్సాపూర్): ట్రిపుల్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులకు సంబంధించిన భూములకు శనివారం రెవెన్యూ సిబ్బంది సర్వే చేశారు. మండల పరిధిలోని కొత్తపేట, రత్నపూర్ గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది భూములను సర్వే చేశారు. అసలైన పట్టాదారు రైతులకు న్యాయం చేస్తామని ఆర్ఐలు కిషన్, సునీల్ తెలిపారు.



కొత్తపేటలో సర్వే చేస్తున్న సిబ్బంది

క్విజ్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ రామాంజనేయులు, ఉపాధ్యాయులు

తూప్రాన్: రాష్ట్ర స్థాయిలో సాహితీ జిగీష ఫౌండేషన్ జంటనగరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌరాణిక క్విజ్‌లో గీతా స్కూల్ విద్యార్థినులు ద్వితీయ బహుమతి సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన అక్షర (పదోతరగతి), సహస్ర (తొమ్మిదవ తరగతి) రామాయణం, మహాభారతం, భాగవత పురాణాల్లోని ప్రశ్నలపై పౌరాణిక క్విజ్ నిర్వహించినట్లు తెలిపారు. హైదరాబాద్ చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో విద్యార్థులకు ప్రముఖ సినీ దర్శకుడు గోపాల కృష్ణ, ప్రముఖ సాహితీవేత్త శ్రీమతి విజయలక్ష్మి ప్రశంసాపత్రంతో పాటు నగదును అందజేశారని వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, చైర్‌పర్సన్ పి.ఉష, ప్రిన్సిపాల్ వెంకటకృష్ణారావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రేంరాజ్, ఉపాధ్యాయులు విద్యార్థినులను అభినందించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264